
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 19 ఆగస్టు 2024





అనుబంధాల ముడి

- నేడు రాఖీ పండుగ
- రాఖీలు, మిఠాయిల కొనుగోళ్లతో సందడి

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం సాంస్కృతికం, ఆగస్టు 18: సోదర, సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే పండుగ రాఖీ పండుగ నేడు.. ప్రతి ఇంటా ఆనందాలు నింపే రక్షాబంధన్‌ను నేడు జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకోనున్నారు. సోదరులకు రాఖీ కట్టేందుకు ఆడబిడ్డలు సిద్ధమవుతున్నారు. మార్కెట్‌లో రకరకాల రాఖీలు అందుబాటులోకి రాగా ఆదివారం కొనుగోళ్లతో మార్కెట్లలో సందడి నెలకంది. నోరు తీపి చేసేందుకు స్వీట్ల అమ్మకాలూ జోరుగా సాగాయి. అన్నాచెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి రాఖీ పండుగ ప్రత్యేకత సంతరించుకుంటుంది. కులమతాలకు అతీతంగా సోదర సోదరీమణుల వాత్సల్యం, అభిమానం, అనురాగం, ప్రేమ, ఆదరణల కలయికే రాఖీ పౌర్ణమి. తన అన్నకు రాఖీ పౌర్ణమిరోజు చెల్లెలు రాఖీ కడుతుంది. అన్న చెల్లికి చక్కని సిరిసంపదలతో, ఆనందంగా భోగభాగ్యాలతో వర్థిల్లు తల్లి అంటూ దీవించి బహుమతి ఇస్తాడు. అన్నా చెల్లెలు ఒకే ప్రాంతంలో ఉన్నా, దూర ప్రాంతాల్లో ఉన్నా రాఖీ రోజు విధిగా కలుసుకుంటారు. నగరంలో వివిధ కూడళ్లల్లో రకరకాల రాఖీలతో దుకాణాలు పలువురిని ఆకర్షిస్తున్నాయి. ఈ సంవత్సరం కూడా రాఖీల ధరలు విపరీతంగా పెరిగాయి. సాధారణంగా రూ.20 నుంచి లభించే రాఖీలు ఈ ఏడాది కనీసం రూ.50 కంటే తక్కువకు మార్కెట్‌లో దొరకడం లేదు. మహిళలు వారి స్థాయిని బట్టి రూ.50నుంచి రూ.1,000 వరకు ధర ఉన్న రాఖీలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.



మార్కెట్‌లో రాఖీల సందడి

సోమవారం ఉదయం నుంచే రాఖీలు కట్టాలనే ఆలోచనలతో మహిళలు ఆదివారం సాయంత్రం నుంచే రాఖీల కొనుగోళ్లలో బిజీగా మారారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు ముందుగానే రాఖీలు కొనుగోలు చేసి తమ తల్లిగారి ఇళ్లకు బయలుదేరారు. ఈ ఏడాది మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించటంతో మహిళలు భారీ సంఖ్యలో రాఖీలు కట్టేందుకు తమవారి ఇంటి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో ఖమ్మం నగరంలోని సిటీ బస్టాండ్‌తో పాటు ఉమ్మడి జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న బస్టాండ్‌లు మహిళలతో సందడిగా మారాయి. ఆదివారం పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో రాఖీ సెంటర్లు, స్వీట్ షాపులు సందడిగా మారాయి. ఈ ఏడాది బంగారం, వెండి, రాళ్ల పొదిగిన రాఖీలకు గిరాకీ బాగా ఉందని వ్యాపారులు పేర్కొన్నారు. కొందరు పేర్లతో కూడిన రాఖీలతో పాటు ఫొటోలతో కూడిన రాఖీలు సైతం ప్రత్యేకంగా తయారు చేయించుకుంటున్నారు. ఖమ్మం నగరంలోని వివిధ ప్రాంతాల్లో రాఖీ సెంటర్లు మహిళలతో సందడిగా మారాయి. ఉమ్మడి జిల్లాలో సత్తుపల్లి, మధిర, వైరా, పాల్వంచ, కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం తదితర ప్రాంతాల్లో ఆదివారం రాఖీ సందడి నెలకొంది

సబ్ క్రిటికల్‌తో కష్టాలు

- బీటీపీఎస్‌లో కాలం చెల్లిన సాంకేతికత
- మొరాయిస్తున్న పరికరాలతో తిప్పలు

6

తమ్ముడికి రాఖీ కట్టేందుకు వెళుతూ..

- కారు ఢీకొని మహిళ మృతి
- ఖమ్మం నగరంలో ఘటన

5



- ఉమ్మడి జిల్లాలో రూ.32కోట్ల బకాయిలు
- 13 నెలలుగా ఆర్థిక ఇబ్బందులతో మునిసిపాలిటీలు
- పారిశుధ్యం నుంచి పరిపాలన వరకు అన్నీ సమస్యలే..

పైసలు లేక పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ నుంచి పరిపాలన వరకు అన్ని పనుల్లోనూ స్తబ్ధత ఏర్పడింది. కనీసం పారిశుధ్య నిర్వహణకు కూడా నిధులు లేకపోవడంతో పట్టణాలు మురికి కూపాలుగా మారుతున్నాయి. పట్టణాల్లో సమస్యల పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ, అభివృద్ధి, ఆహ్లాదం వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా పట్టణ జనాభా ప్రాతిపదికన నిధులు మంజూరు చేస్తాయి. కేంద్రం మంజూరు చేసే నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ తరుపున స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేస్తారు. ప్రతీ మూడు నెలలకు ఒక క్వార్టర్ చొప్పున నిధులు మంజూరవుతాయి.

నిధులు లేక విధులు బంద్



ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 18: రాష్ట్ర ప్రభుత్వ విడుదల చేస్తే నిధుల ద్వారానే మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో అభివృద్ధి, ప్రజా సమస్యలు పరిష్కారం కోసం డబ్బులు ఖర్చు చేస్తారు. అయితే జనాభా ఎంత పెరిగినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం 2011 జనాభా లెక్కల ప్రాతిపదికనే నిధులు మంజూరు చేయటంతో ప్రజా సమస్యలు పరిష్కారానికి నిధుల లేమి కనిపిస్తోంది. 13 నెలలుగా అస్సలు నిధులే విడుదల కాకపోవటంతో ఖమ్మం నగర పాలక సంస్థతోపాటుగా వైరా, మధిర, సత్తుపల్లి, పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు మునిసిపాలిటీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

సీజనల్ వ్యాధుల సమయంలో ఆర్థిక ఇబ్బందులు

13 నెలలుగా మునిసిపాలిటీలకు రావాల్సిన రూ.32,13,61,261 స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్ నిధులు రాకపోవటంతో ఉద్యోగులు, పారిశుధ్య కార్మికుల వేతనాలు పెండింగ్‌లో పడ్డాయి. పారిశుధ్య వాహనాల నిర్వహణ ఇబ్బందిగా మారింది. దీంతో మునిసిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ మూలనపడి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇక నర్సరీలు నిర్వహణ, పార్కుల అభివృద్ధి, వైకుంఠధామాల అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, వ్యాయామశాలలు, పబ్లిక్ టాయిలెట్లు, పారిశుధ్య వాహనాలు కొనుగోలు చేసేందుకు మునిసిపాలిటీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. సీజనల్ వ్యాధుల వ్యాప్తి సమయంలో నిధుల కొరత ఏర్పడటంతో పారిశుధ్య కార్యక్రమాలు మందగించాయి. దీంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. మునిసిపాలిటీల్లో విద్యుత్ బకాయిలు పెండింగ్‌లోకి వెళ్లాయి. రోజువారీ పరిపాలనకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్స్ నుంచి రావాల్సిన బకాయిలు ఇలా..

ఖమ్మం నగర పాలక సంస్థ	రూ,13,29,99,958
సత్తుపల్లి మునిసిపాలిటీ	రూ. 1,58,75,561
మధిర మునిసిపాలిటీ	రూ. 1,62,94,369
వైరా మునిసిపాలిటీ	రూ. 1,59,35,114
కొత్తగూడెం మునిసిపాలిటీ	రూ. 3,64,01,261
ఇల్లెందు మునిసిపాలిటీ	రూ. 1,56,09,659
మణుగూరు మునిసిపాలిటీ	రూ. 1,59,01,106
పాల్వంచ మునిసిపాలిటీ	రూ. 7,23,44,233




సర్దార్ పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

సర్వాయి పాపన్న పోరాటస్ఫూర్తితో ముందుకు వెళ్లాలి

- భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్
- కొత్తగూడెంలో ఐడీఓసీలో ఘనంగా 374వ జయంతి వేడుకలు

కొత్తగూడెం, ఆగస్టు 18: సర్దార్ పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఐడీవోసీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ 374వ జయంతి వేడుకల్లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అదనపు కలెక్టర్ డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తి అనుసరణీయమన్నారు. మహనీయుల త్యాగాల నిరతి నేటి తరాల వారు తెలుసుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం అధికారంగా సర్దార్ పాపన్న జయంత్రి ఉత్సవాలు నిర్వహిస్తోందన్నారు. సర్వాయిపాపన్నగౌడ్ మార్గదర్శకత్వం ఎంతో అనుసరిణీయమని, ఆ మహనీయుని ఆశయాలను అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో అందరూ సమానులేనన్న భావన పెంపొందేందుకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌడ కూలీలకు తాటిబెల్లం తయారీకి, తాటిచెట్లు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ద్వారా నాటేందుకు మొక్కలు అందించారు. కాటయ్య రక్షపథకం ద్వారా గౌడ కులస్తులకు రక్షణ కిట్లు అందిస్తామని, వృత్తితో శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి ఇందిర, జిల్లా పరిపాలన అధికారి గన్య, బండి రాజు గౌడ్, అందెం గంగరాజు, కే.గౌతమ్, ఆబ్కారీశాఖ టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ జే.రమేష్, ఆబ్కారీశాఖ ఏఈ పాసిని వెంకన్నగౌడ్, బి.రవిగౌడ్, ఇజ్జగాని రవిగౌడ్, కొదుమూరి సత్యనారాయణ, బొర్రా జయమ్మ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య విద్య అడ్మిషన్లకు సంబంధించి రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసిన కొత్త జీవో వివాదాస్పదమైంది. దీనివల్ల ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుండగా తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొత్త జీవో వల్ల కౌన్సిలింగ్‌కు కూడా కొందరు దరఖాస్తు చేసుకునే వీలు కూడా లేకపోవటంతో రాష్ట్రం నలుమూలల నుంచి 170 మంది విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా హైకోర్టు స్పందించిందని విద్యార్థులు తెలిపారు. కోర్టును ఆశ్రయించిన వారిలో సత్తుపల్లికి చెందిన వారు కూడా ఉన్నారు. ఈ జీవో వల్ల రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న ఒక్క ఖమ్మం జిల్లాలోనే 100 మంది విద్యార్థులు ఎదుర్కొంటున్నారు.

- జీవో-33తో ఇతర రాష్ట్రాల విద్యార్థులకు ప్రయోజనం
- కౌన్సెలింగ్‌కూ దరఖాస్తు చేయలేకపోయిన కొందరు విద్యార్థులు
- రెసిడెన్షియల్ ప్రామాణికంగా తీసుకోవాలని వినతి
- దరఖాస్తులకు అనుమతించాలని ఆదేశించిన హైకోర్టు
- జిల్లాలో ఇబ్బందులెదుర్కొంటున్న 100 మంది విద్యార్థులు

మెడికల్ కౌన్సెలింగ్‌కు 'లోకల్' కష్టాలు

'స్థానికత' నిర్ధారణకు కొత్త నిబంధనలతో గందరగోళం

సత్తుపల్లి, ఆగస్టు 18: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల మూడో తేదీన కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్శిటీ నోటిఫికేషన్ జారీ చేసింది. గత నెల 19న రాష్ట్ర ప్రభుత్వం గతంతో ఉన్న జీవోకు జోడిస్తూ జీవో 33ని జారీ చేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో అడ్మిషన్ల నిబంధనలు-2017ను ఉల్లంఘిస్తూ ఈ జీవో పూర్తిగా విరుద్ధమని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటి జీవోకు జోడిస్తూ జారీ చేసిన 33జీవో ప్రకారం విద్యార్థులు 9, 10 తరగతులతో పాటు ఇంటర్ స్థానికంగా చదివి ఉండాలి. పరీక్షలు కూడా ఇక్కడే రాయాల్సి ఉంటుంది. అంతేకాక రాష్ట్రంలోనే నివసిస్తూ ఉండాలనేది జీవో సారాంశం. ఇది చట్ట విరుద్ధమని విద్యార్థులు వాదిస్తున్నారు. వైద్య విద్య సీట్ల భర్తీలో శాశ్వత నివాసితులైన విద్యార్థులను స్థానికులుగానే పరిగణించాలని గతేడాది హైకోర్టు స్పష్టం చేసిందని, ఈ మేరకు గత విద్యా సంవత్సరంలో సీట్లు భర్తీ చేయాలని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్శిటీని కోర్టు ఆదేశించింది. గత నెల జారీ అయిన కొత్త జీవోతో లోకల్ ఏరియా నిబంధనల వల్ల విద్యార్థులు కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోనే వీలు లేక కోర్టును ఆశ్రయించారు.

రెసిడెన్షియల్ ప్రామాణికంగా తీసుకోవాలి

రాష్ట్రంలోని పలు ప్రాంతాల విద్యార్థులు సరిహద్దుల్లోని ఏపీ సహా ఇతర రాష్ట్రాల్లో ఉన్న పెద్ద విద్యా సంస్థల్లో ఇంటర్ చదువుకునేందుకు వెళుతున్నారు. కొందరు పదో తరగతి, కొందరు ఇంటర్ చదువుతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన 33 జీవో ప్రకారం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో విద్యార్థులు చదవి వచ్చినా తల్లిదండ్రులు మన రాష్ట్రంలోనే స్థిరపడి ఉన్నారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. కొత్త జీవో ప్రకారం వరుసగా నాలుగు సంవత్సరాలు మన రాష్ట్రంలో చదివి ఉండాలని, లేదా ఇంటర్మీడియెట్ చదివి ఉండాలని, దీనినే లోకల్ ఏరియాగా పరిగణించనున్నట్టు నిబంధన విధించటంతో విద్యార్థులు ఇటీవల వెలువడిన ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేయలేని పరిస్థితి ఏర్పడింది. 1 నుంచి 7వ తరగతి వరకూ స్థానికంగా చదవి తల్లిదండ్రుల నివాసాన్ని పరిగణలోకి తీసుకొని రెసిడెన్షియల్ ధ్రువీకరణ పత్రాన్ని అనుమతించాలని విద్యార్థులు కోరుతున్నారు. జీవో 33లో పేర్కొన్న వరుసగా నాలుగేళ్ల స్థానికంగా చదివి ఉండాలనే నిబంధన తెలంగాణ విద్యార్థుల్లో కొందరికి శాపంగా మారగా ఇతర రాష్ట్రాల విద్యార్థులకు మాత్రం ఇరు రాష్ట్రాల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో అర్హత సాధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొత్త జీవో ఇతర రాష్ట్రాల విద్యార్థులకు అనుకూలంగా ఉందని స్థానిక విద్యార్థులు వాదిస్తున్నారు. ఉదాహరణకు తమిళనాడుకు చెందిన విద్యార్థులు తెలంగాణాలో వరుసగా నాలుగేళ్లు చదివి ఉంటే ఇక్కడ స్టడీ, కండక్ట్‌తో అర్హత సాధిస్తున్నారు. కానీ సదరు విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడ నివాసం ఉంటున్న కారణంగా ఆ రాష్ట్రంలో కూడా వారు అర్హత సాధించేందుకు అక్కడి ప్రభుత్వం అనుమతిస్తోంది. దీంతో వారు ఇరు రాష్ట్రాల్లో అర్హత సాధిస్తున్నారు. ఇలా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర విద్యార్థులు వారి స్వరాష్ట్రాలతో పాటు తెలంగాణాలోనూ ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో చేరే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కానీ వరుసగా నాలుగేళ్ల పక్క రాష్ట్రంలో తెలంగాణ విద్యార్థులు చదివినా శాశ్వత నివాసం లేని కారణంగా ఆయా రాష్ట్రాల్లో ప్రవేశాల్లో అవకాశం లేదు.

ఈ రకంగా తెలంగాణ విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఆయా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణాలో అత్యధికంగా మెడికల్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. తల్లిదండ్రుల శాశ్వత నివాసాన్ని పరిగణలోకి తీసుకొని రెసిడెన్సియల్ సర్టిఫికెట్‌ను ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాల్లో అనుమతించాలని, 1 నుంచి 7 వరకూ స్టడీ కండక్ట్ సర్టిఫికెట్, టెన్త్ లేదా ఇంటర్ ప్రామాణికంగా తీసుకొని భవిష్యత్తులో తెలంగాణ విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేటితో ముగియనున్న పవిత్రోత్సవాలు

భద్రాచలం, ఆగస్టు 18: భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గత రెండు రోజులుగా హోమాలు, వేద పారాయణం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఈ నెల 14న పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరిగింది. సోమవారం పవిత్రోత్సవాలకు పూర్ణాహుతి, పవిత్రాల ఉద్వాసన, మహాకుంభ ప్రోక్షణ చేయనున్నారు. ఇదిలా ఉండగా పవిత్రోత్సవాలను పురస్కరించుకొని 15 నుంచి 19వ తేదీ వరకు ఆలయంలో నిర్వహించే నిత్య కల్యాణాలను నిలిపివేయగా మంగళవారం నిత్యకల్యాణాలను పునరుద్ధరించనున్నారు.

హాస్టల్ విద్యార్థులకు హెల్త్‌కార్డులు

- వసతిగృహాల్లో సమస్యల పరిష్కారంపై దృష్టి
- ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్ చదివే విద్యార్థులకు కార్పొరేట్ విద్యాపథకం
- విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రూ.20లక్షల ఉపకారవేతనం
- ఎస్సీ కార్పొరేషన్ డీడీ కె.సత్యనారాయణ

ఖమ్మం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో ప్రభుత్వసాంఘిక సంక్షేమ హాస్టళ్లలో వసతులు మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై కూడా దృష్టిపెట్టామని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కలిపిస్తున్నామని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వివరించారు.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపరిచేందుకు చేపడుతున్న కృషి ఏంటి?

డీడీ: జిల్లాలో 41 వసతి గృహాలుండగా వాటిలో 27బాలురు, 14బాలికల హాస్టళ్లున్నాయి. ఆయా హాస్టళ్లలో 2,046మంది బాలురు, 1,263 మంది బాలికలు మొత్తం 3,309 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇవి కాకుండా ఇంటర్, పీజీ విద్యార్థులకు 11 వసతిగృహాలు నిర్వహిస్తున్నాం. ఇందులో ఆరు బాలురు ఐదు బాలికల వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 1,325మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరందరికీ అల్పాహారంతో పాటు భోజన వసతులు పూర్తిస్థాయిలో అందిస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు త్వరలో హెల్త్‌కార్డులు మంజూరు చేయబోతున్నాం. తద్వారా నెలవారీగా విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో వసతి గృహాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలు ఉన్నట్లు పలుచోట్ల ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?



డీడీ: ప్రభుత్వ హాస్టళ్లన్నింటికీ మిషన్‌భగీరథ ద్వారా ప్రత్యేకంగా తాగునీరందిస్తున్నాం. ఈ సౌకర్యం లేనిచోట ప్యూరిఫైయిడ్ వాటర్‌ప్లాంట్ ద్వారా తాగునీరు ఇస్తున్నాం. ప్రతి పది మంది విద్యార్థులకు ఒక బాత్‌రూం, మరుగుదొడ్డి ఏర్పాటు చేశాం. అన్ని మరుగుదొడ్లకు డోర్లు, నీటి సదుపాయం కల్పించాం. కిటికీలకు దోమల జాలీలు ఏర్పాటు చేశాం. విద్యార్థులు కింద పడుకోకుండా బెడ్లు, రెండు జతల దుస్తులు, పెట్టె, దుప్పట్లు అందించాం. సౌకర్యాలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సాంఘిక సంక్షేమశాఖ ద్వారా అందించే ఇతర సంక్షేమ కార్యక్రమాలు ?

డీడీ: ఎస్సీ విద్యార్థులకు పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలు అందిస్తున్నాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా విద్యార్థులకు పూర్తిగా ఆయా కళాశాలలకు సంబంధించి అకౌంట్లలో ఫీజులు చెల్లిస్తున్నాం. ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 5నుంచి 8వ తరగతి చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు ఏడాదికి బాలికలకు రూ.1,500, బాలురకు రూ.1,000 హాస్టల్స్‌లో లేకుండా ఇతర పాఠశాలల్లో చదవుతున్న విద్యార్థులకు అందిస్తున్నాం. రాజీవ్ విద్యాదీవెన కింద 9నుంచి పది చదువుతున్న విద్యార్థులకు ఏడాదికి రూ.3వేల ఉపకార వేతనం అందిస్తున్నాం. అలాగే ఎస్సీ న్యాయవాద పట్టబదులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు ఎంపికైన న్యాయవాదులకు నెలకు రూ.3వేల చొప్పున 36నెలలు ఉపకార వేతనం అందిస్తున్నాం. వారికి కావాల్సిన మెటీరియల్ వృత్తినైపుణ్యాం పెంపునకు ఇవి అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇంటర్ విద్యార్థులకు కార్పొరేట్ విద్యాపథకం, విదేశాలలో చదివే విద్యార్థులకు సాంఘిక సంక్షేమశాఖ నుంచి అందిస్తున్న సహకారం ఏమిటి ?

డీడీ: ఇంటర్ ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ విద్యాపథకం కింద జిల్లాలో 120మంది విద్యార్థులకు ఏడాదికి రూ.33వేలు అందిస్తున్నాం. రూ.5వేల పాకెట్ మనీ కూడా మంజూరు చేస్తున్నాం. ఈ పథకం ద్వారా 120మంది విద్యార్థులు లబ్ధి పొందుతున్నారు. అలాగే అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రూ.20లక్షల ఉపకార వేతనం, వీసా చార్జీలు కూడా అందిస్తున్నాం. 2024-25విద్యా సంవత్సరంలో రూ.1.33కోట్లు ఏడుగురు విద్యార్థులకు మంజూరుచేశాం. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ కింద జిల్లాలో 1,179మంది విద్యార్థులకు రూ.1.25కోట్లు మంజూరు చేశాం.

ఆంధ్రజ్యోతి: కులాంతర వివాహాలకు మీరిచ్చే ప్రోత్సాహం ఏమిటి ?

డీడీ: కులాంతర వివాహం కింద ఎస్సీ యువతీ యువకలను ఎవరైనా వివాహం చేసుకుంటే వారికి రూ.2.5లక్షలు ప్రోత్సాహకం అందిస్తున్నాం. ఇలా కులాంతర వివాహం చేసుకున్నవారిలో జిల్లాలో ఈ ఏడాది నాలుగు జంటలను ఎంపికచేశాం. వారికి రూ.10లక్షలు మంజూరయ్యాయి.

వ్యర్థాలతో కుళ్లిపోతున్న నగరం

- విచ్చలవిడిగా ఖాళీ కొబ్బరి బొండాల నిల్వలు, వ్యర్థాలు
- దోమలు పుడుతూ.. కుడుతూ.. జ్వరాలు పెంచుతూ..
- ఇకో కంపెనీకి నెలకు కేఎంసీ నుంచి రూ.10లక్షలు
- కమర్షియల్ వ్యాపారుల నుంచి వచ్చే ఆదాయంలో 50శాతం
- రోజు వారీగా వ్యర్థాలను తొలగించటంలో జాప్యం
- గతంలో జరిమాన విధించినా అసిస్టెంట్ కమిషనర్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 18: పారిశుధ్యంలో అగ్రభాగాన ఉంటూ గ్రీన్ సిటీ అవార్డును సైతం కైవసం చేసుకున్న ఖమ్మం నగరంలో గత ఆరు నెలలుగా వ్యర్థాలతో కుళ్లి పోతుందా అనే విమర్శలు వెలువడుతున్నాయి. రాష్ట్రంలోనే హైదరాబాద్ తర్వాత వైద్య హబ్‌గా ఖమ్మానికి ఖ్యాతి ఉంది. వందల సంఖ్యలో ప్రైవేట్ హాస్పటల్స్ నుంచి టన్నుల కొద్ది వ్యర్థాలు వస్తుంటాయి. వీటితో పాటుగా ప్రైవేట్ హాస్పటల్స్‌కు సమీపంలోనే రోగులకు అందుబాటులో కొబ్బరిబొండాల వీధి వ్యాపారులు వందల సంఖ్యలో కొబ్బరిబొండాల అమ్మకాలు చేస్తున్నారు. ఇక హోటల్స్, రెస్టారెంట్లు, కిరాణాలు, షాపింగ్ మాల్స్ నుంచి టన్నుల కొద్ది వ్యర్థాలు బయటకు వస్తుంటాయి.

నెలకు రూ.10లక్షలతో ఒప్పందం

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని కమర్షియల్ వ్యాపారాలైన ప్రైవేట్ హాస్పటల్స్, రెస్టారెంట్లు, హోటల్స్, కిరాణం, షాపింగ్ మాల్స్ నుంచి వీధి వ్యాపారుల వరకు వచ్చే వ్యర్థాలను తీసుకేళ్లేందుకు ఖమ్మం నగర పాలక సంస్థ ఇకో సంస్థతో టెండర్ విధానంలో అగ్రిమెంట్ చేసుకొంది. వ్యర్థాలను స్వీకరించినందుకు గాను కేఎంసీ నుంచి నెలకు రూ.10లక్షలను ఆయా సంస్థకు చెల్లిస్తున్నారు. అలాగే కమర్షియల్ వ్యాపారుల నుంచి వీధి వ్యాపారుల వరకు చెల్లించే పారిశుధ్య నిర్వహణ బిల్లులో 50శాతం వరకు కేఎంసీ తీసుకొని మిగిలిన 50 శాతాన్ని ఇకో సంస్థకు అందిస్తున్నారు. కొబ్బరిబొండాల వ్యాపారులు ఒక్కో కొబ్బరిబొండానికి రూ.1 ఇస్తుండగా కమర్షియల్ వ్యాపారుల నుంచి అధికారికంగా బిల్లులు ఇవ్వకుండానే పలు ప్రైవేట్ హాస్పటల్స్, రెస్టారెంట్లు నుంచి డబ్బులు వసూళ్లు చేస్తున్నారే బహిరంగ విమర్శలు ఉన్నాయి.

గతంలో వ్యర్థాలను తొలగించకుంటే జరిమాన

కేఎంసీతో ఇకో సంస్థ టెండర్ ఒప్పందం మేరకు ఖమ్మం నగరంలోని వ్యర్థాలను రోజు వారీగా తొలగించాల్సి ఉంటుంది. కాని ఆరు నెలలుగా అనేక విమర్శలు వెలువడుతున్నాయి. ఖమ్మం జడ్పీ సెంటర్ నుంచి మయూరి సెంటర్ వరకు మూడు నుంచి నాలుగు రోజుల వరకు నిల్వలు ఉంచటంతో కొబ్బరిబొండాలు, ఇతర వ్యర్థాల నిల్వలు పెరిగి కొబ్బరి బొండాలు దోమల పెరుగుదలకు కారణమవుతున్నాయి. గతంలో పనిచేసిన అసిస్టెంట్ కమిషనర్ రోజు వారీగా వ్యర్థాలను తరలించకుంటే సంబంధిత సంస్థకు జరిమాన



విధించారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేక పోవటంతో వ్యర్థాలను తొలగించటంలో జాప్యం చేస్తున్నారని విమర్శలు వెలువడుతున్నాయి.

రోజు వారీగా వ్యర్థాల తొలగింపునకు చర్యలు

సాంబయ్య, శానిటేషన్, సూపర్‌వైజర్

ఇకో సంస్థ కొన్ని ప్రత్యేకమైన ప్రాంతాల్లో వ్యర్థాలను రోజువారీగా తొలగించాల్సి ఉంటుంది. ఫిర్యాదులు అందిన చోట వెంటనే పరిష్కారం చేస్తున్నాం. రోజు వారీగా వ్యర్థాలను తొలగింపునకు చర్యలు తీసుకుంటాం.

నిట్టా రాంబాబు కుటుంబానికి
రూ.6 లక్షల చెక్కు అందజేత

నివాళులర్పించిన యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు

మణుగూరు, ఆగస్టు 18: మణుగూరు పట్టణంలోని పైలట్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసే నిట్టా రాంబాబు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఆదివారం రాంబాబు స్వగృహం వద్ద దశదిన కర్మ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో నాయకులు చాడా రవి మాట్లాడుతూ యూనియన్ తరుపున ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ తయారు చేయడం జరిగిందన్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు బాధిత టీచర్ కుటుంబసభ్యులకు కేవలం 10 రోజుల కాల వ్యవధిలోనే రూ.6లక్షలను చెక్కు రూపంలో అందించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనియన్ సభ్యుల నుంచి రూ.100ల చొప్పున సేకరించి ఈ మొత్తాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా నిట్టా రాంబాబు కుటుంబ సభ్యులకు యూనియన్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తన చిన్ననాటి మిత్రుడు ఇలా అకాల మరణం చెందటం బాధాకరమన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను సభలో పంచుకున్నారు. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఏ సాయం కావాలన్నా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఉదారత

- సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు



మొరం పోయిస్తున్న ఉపాధ్యాయుడు వీరస్వామి

చర్ల, ఆగస్టు 18: రహదారి సరిగ్గా లేకపోవడంలో స్థానిక ఉపాధ్యాయుడు సొంత ఖర్చులతో మొరం పోయించి రహదారికి మరమ్మతులు చేయించిన ఘటన చర్ల మండలం బూరుగుపాడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బూరుగుపాడు గ్రామం మావోయిస్టు ప్రభావిత ప్రాంతం. గత కొంతకాలంగా నూతన రహదారులు మంజూరవుతున్నా అటవీ అనుమతుల కారణంగా పనులు ప్రారంభం కావడం లేదు. మట్టి రోడ్డు కావడంతో వర్షాకాలంలో రోడ్డు మొత్తం బురదమయంగా మారుతోంది. దీంతో స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీరస్వామి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం జేసీబీ, ట్రాక్టర్లు పెట్టి సొంత ఖర్చులతో రహదారిపై మొరం పోయించాడు. రోడ్డు సరిగ్గా లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారని, గత కొద్ది రోజుల క్రితం బురద ఉండడంతో అంబులెన్స్ కూడా రాలేక గర్భిణిని జెడ్డీపై మోసుకుని వెళ్లాల్సి వచ్చిందని అందుకే మొరం పోయించి రోడ్డును, కొంతవరకు అయినా బాగు చేయాలని మట్టి పోయించడం జరిగిందని ఉపాధ్యాయుడు తెలిపాడు.

స్నేహితుల కుటుంబాలకు
రూ.1.20లక్షల ఆర్థిక చేయూత

వైరా, ఆగస్టు 18: చెట్టాపట్టాలేసుకొని తిరగడమే మిత్రుత్వం అని భావించే నేటి సమాజంలో అనివార్య కారణాలతో అశువులుబాసిన తమ చిన్ననాటి స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించి స్నేహబంధాన్ని చాటుకున్నారు. బాల్యంలో తమతో చదువుకున్న ఇద్దరు స్నేహితులు అకాల మృతిచెందడంతో వారి కుటుంబాలకు అండగా నిలుస్తూ తమ పెద్దమనస్సును చాటుకున్నారు. ఇద్దరు స్నేహితుల కుటుంబాలకు ఆదివారం వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, వనమా విశ్వేశ్వరరావు చేతులమీదుగా రూ.1.20లక్షలను అందజేశారు.

స్థానిక మధు-ఠాగూర్ విద్యాలయాల్లో 1997-98 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ముందుకొచ్చి ఆర్థిక చేయూతనందించారు. వైరాకు చెందిన తల్లపురెడ్డి కొండారెడ్డి కుటుంబానికి రూ.50వేలు అలాగే సూతకాని రజనీకాంత్ కుటుంబానికి రూ.30వేలు ఆర్థికసాయం చేశారు. అలాగే మండలంలోని కొష్టాల గ్రామానికి చెందిన మానసిక సమస్యతో బాధపడుతున్న లింగాల ప్రసాద్‌కు రూ.40వేల ఆర్థికసహాయాన్ని అందజేశారు. ఈ పూర్వవిద్యార్థులను ఏసీపీ అభినందించారు. స్నేహితులంతా ఒకే కుటుంబంగా మారి ఇటువంటి సేవా దృక్పథం అలవర్చుకోవడం ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. పూర్వవిద్యార్థులు మిట్టపల్లి కిరణ్ కుమార్, నందిగామ మనోహర్, సముద్రాల మురళీకృష్ణ, బట్టు నర్సింహారావు, సింగు మహేందర్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి నుంచి
కొండపల్లి వద్ద ఎగ్జిట్ ఇవ్వండి

- మంత్రులకు ప్రజల విజ్ఞప్తి...
- ఎగ్జిట్ కోసం ఆందోళనలో మండల ప్రజలు

నేలకొండపల్లి, ఆగస్టు 18: 365ఏ జాతీయ రహదారి ఎక్కటానికి, దిగటానికి నేలకొండపల్లి వద్ద ఎగ్జిట్ ఇవ్వక పోవటం పట్ల మండల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆచార్లగూడెం వద్ద ఎగ్జిట్ ఇవ్వాలని కోరుతున్నారు. దీనికోసం ఆందోళనకు సైతం సిద్ధమవుతున్నారు. ఆందోళన బాట పట్టారు. వివరాల్లోకి వెళితే నేలకొండపల్లికి చరిత్రలో ఎంతో ప్రాధాన్యం ఉంది. దేశంలోనే ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయాన్ని నిర్మించిన భక్తరామదాసు జన్మస్థలం నేలకొండపల్లి. అంతేకాదు భక్తరామదాసు నివసించిన ఇంటిని ఆయన స్మారకంగా ధ్యానమందిరంగా అభివృద్ధి చేసారు. ధ్యానమందిరం ఆవరణలో దాదాపు రూ.2.00కోట్ల వ్యయంతో అత్యంత అధునాతనమైన ఆడిటోరియంను నిర్మించారు. ఆసియాలోనే అత్యంత పెద్దదైన బౌద్ధస్థూపం ఉన్న ప్రాంతం నేలకొండపల్లి. నేలకొండపల్లిని పర్యాటక కేంద్రంగా చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఎన్నో పురాతనమైన, ప్రసిద్ధి చెందిన ఆలయాలున్న ప్రాంతం నేలకొండపల్లి. నేలకొండపల్లి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందితే సంవత్సరం పొడవునా పర్యాటకులు నేలకొండపల్లిని సందర్శించేఆశాలున్నాయి. చరిత్రలో అటువంటి ప్రాధాన్యం ఉన్న నేలకొండపల్లికి 365ఏ జాతీయ రహదారి నుంచి ఎక్కటానికి, దిగటానికి దారి ఇవ్వకపోవటం అత్యంత శోచనీయం. జాతీయ రహదారి నుంచి నేలకొండపల్లి సమీపంలోని ఆచార్లగూడెం అడ్డరోడ్డు వద్ద దారి ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా మంత్రులు ముఖ్యంగా పాలేరు నియోజకవర్గానికి చెందిన మంత్రి పొంగులేటి జాతీయ రహదారి నుంచి నేలకొండపల్లి వద్ద ఎగ్జి ఇవ్వటానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కుల, జనగణన తర్వాతే
స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

జస్టిస్ చంద్రకుమార్

ఖమ్మం చర్చికాంపౌండ్, ఆగస్టు 18: కుల, జనగణన నిర్వహించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కుల, జనగణన బీసీల రిజర్వేషన్ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన జస్టిస్ చంద్రకుమార్, విద్యావేత్త కంచె అయిలయ్య మాట్లాడుతూ విద్య, ఉద్యోగాలు, రాజకీయ పరంగా జనాభా ప్రకారం మనకు రావాల్సిన వాటా కోసం దళిత బహుజనజాతులు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారా మనకు రాజకీయ ఆర్థిక సమానత్వం లభిస్తుందన్నారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం కుల, జనగణన నిర్వహించాలన్నారు. లేకపోతే బహుజన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ సదస్సులో నల్ల సూర్యప్రకాష్, పర్వతాలు, రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

31 వరకు ఓపెన్ ఇంటర్మీడియెట్ ప్రవేశాలు

కొత్తగూడెం సెంటర్ కో-ఆర్డినేటర్ కత్తి రమేష్

చుంచుపల్లి, ఆగస్టు 18:ఈ నెల 31వ తేదీ చివరి వరకు ఓపెన్ ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ - కొత్తగూడెం టాస్ కో-ఆర్డినేటర్ కత్తి రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తి గల విద్యార్థులు, వివాహితులు వయో పరిమితి నిబంధన లేకుండా కళాశాలకు వెళ్లి చదువుకోలేని వారు ఈ తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి ప్రజావాణి రద్దు..

కొత్తగూడెం, ఆగస్టు 18: రాఖీ పండుగ సందర్భంగా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు గమనిచగలరని కోరారు.

రామాలయ ఈవోపై
ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కమిటీ డిమాండ్

భద్రాచలం, ఆగస్టు 18: ఏపీలోని అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలోని రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారనే ఆరోపణలతో ఆదివాసి మహిళలు, ఇంటి నిర్మాణాలపై దాడి చేయించిన రామాలయ ఈవో రమాదేవిపై ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కమిటీ డిమాండ్ చేసింది. పురుషోత్తపట్నంలో ఈ నెల 16న దేవస్థానం ఈవో వ్యవహరించిన తీరు సమర్ధనీయం కాదన్నారు. ఆదివారం ఆ ప్రాంతాన్ని ఆదివాసీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు చేపడితే అడ్డుకోలేని అధికారులు నిరుపేద ఆదివాసీలు నిర్మాణాలు చేపడితే అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆదివాసీలపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, ఈవోపై అట్రాసిటి కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ భద్రాచలం డివిజన్ కన్వీనర్ రేసు ఆదినారాయణమూర్తి, డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లుదొర, ఉపాధ్యక్షుడు రేసు తిరుపతిరావు, కార్యదర్శి శ్యామల గోవిందరాజు, రామచంద్రయ్య, రంగమ్మ, పునేశ్వరరావు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన ఖమ్మం కలెక్టర్



న్యాయమూర్తితో సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 18: రాష్ట్ర ఉన్నత న్యాయస్థానమైన హైకోర్టు న్యాయమూర్తి కాజా శరత్‌ను ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదివారం కలిశారు. ఖమ్మం వచ్చిన న్యాయమూర్తిని కలెక్టర్ ఎన్నెస్పీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఆ తర్వాత జిల్లా పరిస్థితులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాల గురించి న్యాయమూర్తికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వివరించారు.

పెనుబల్లి ఆసుపత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్‌ఎస్



వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌గౌడ్

పెనుబల్లి, ఆగస్టు 18: పెనుబల్లి సీహెచ్‌సీ ఆసుపత్రిని డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌గౌడ్ ఆదివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రిజిస్టర్లను పరిశీలించి, సిబ్బంది గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వైద్యాధికారి కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరిగిందని, మందుల కొరత ఉందని కిరణ్‌కుమార్ ఆయన దృష్టికి తీసుకువెళ్లగా, మందులు అవసరమైన విషయం తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే సరఫరా చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూతో బాలిక మృతి

ఇల్లెందు టౌన్, ఆగస్టు 18: భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణంలో ఆదివారం డెంగ్యూతో బాలికల మృతి చెందింది. పట్టణంలోని స్టేషన్‌బస్తీకి చెందిన బండ్ల రిషిత(11) డెంగ్యూ జ్వరంతో గత వారం రోజులుగా చికిత్సలు పొందుతూ ఆదివారం మృతి చెందింది. వారం రోజుల క్రితం రిషితకు జ్వరంతో రావడంతో ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెంగ్యూ సోకినట్లు నిర్ధారించారు. దాంతో మెరుగైనవైద్యం కోసం బాలికను ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్సలు నిర్వహించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఖమ్మం నుంచి వరంగల్ ఎంజీఎంకు అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం బాలిక మృతి చెందింది. బాలిక తండ్రి వెంకన్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. బాలిక మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

సాగునీటి సరఫరాకు అవరోధం

- సాగర్ కాల్వలో విరితంగా పెరిగిన జమ్ము, నాచు
- పట్టించుకోని అధికారులు

కల్లూరు, ఆగస్టు18: జలవనరుల శాఖ కల్లూరు డివిజన్ పరిధిలో సాగర్ కాల్వల్లో నీటి సరఫరా అవరోధంగా మారింది. విపరీతంగా జమ్ము, నాచు వంటి తదితర మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. ఈ డివిజన్‌లో గల 21 ఉపప్రధాన సాగర్ కాల్వపై 55 కిమినుంచి 77 కిమి వరకుపొడవున రహదారికి ఇరువైపులా తుమ్మ చెట్లు పెరిగి కాల్వలను కమ్మేస్తున్నాయ. దీంతో కాల్వపై రైతులు, బాటసారుల ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ఈ డివిజన్‌లో గల మధిర బ్రాంచి కాల్వ 0నుంచి 22 కిమి వరకు పొడవున విస్తరించిగా దీని పరిధిలో 31వేల ఎకరాల ఆయుకట్టు సాగవుతుంది. ప్రధానంగా 21 ఎంబీసీ ప్రధాన ఉప కాల్వపై 0నుంచి 14 కిమి పొడవున కాల్వ లోపల భాగంలో అడుగున వరదతో కూడిన మట్టి చేరింది. దీనిపై విపరీతంగా జమ్ము, నాచు వంటి తదితర వృక్షాలు విపరింతగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. నీటి సరఫరాకు అవరోధంగా మారనున్నదని పలువురు ఆయకట్టు రైతులు చెప్తున్నారు. జలవనరుల శాఖ అధికారులకు క్వాల్వలపై స్పష్టమైన అవగాహన లేక పోవటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు విమర్శిస్తున్నారు. మధిర బ్రాంచి కెనాల్ సాగునీటి సరఫరా పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 1541 కాగా 21 ప్రధాన ఉప కాల్వ 72 కిమి కప్పలబంధం రెగ్యులేటర్ నుంచి నీరు పూర్తి స్థాయిలో విడుదల చేయని పరిస్థితి గత అనుభా వాలు చెప్తున్నారు. ఇక ఈ వానకాలం పంటకు సాగర్ కాల్వ నీటి విడుదల సమయం సమీపిస్తున్న తరుణంలలో కాల్వలు పైవిధంగా అధ్వానంగా మారంటం తో సాగర్ కాల్వ (మధిర బ్రాంచికాల్వ) చివరి భూములకు సాగునీరు అందటం ప్రశ్నార్ధకంగా మారనున్నది. గతంలో ఎన్నెస్పీశాఖ ఉన్నప్పడు ఇంజనీరింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో సాగర్ కాల్వలపై సందర్శించి వానకాలం పంటకు ముందుగా అత్యవసర పనుల కింద మరమ్మ తులు చేయించేవారు. మధిర బ్రాంచికెనాల్ పరిధిలో 31వేల ఎకరాల ఆయుకట్టు విస్తరించి ఉంది. దీనిపై జలవనరులశాఖ ఈఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా కాల్వలోపల పెరిగిన జమ్ము ఇతర మొక్కలను లస్కర్లతో తొలిగిస్తున్నామని చెప్పారు. ఈ మొక్కలతో వానకాలం పంట సాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం ఉండదు.



అడవిని తలపిస్తున్న మధిర బ్రాంచి కాల్వ



అసాంఘిక కార్యకలాపాలకు
అడ్డాగా జూనియర్ కళాశాల

- ప్రహరీ లేక కళాశాల ఆవరణలోకి మందు బాబులు



కళాశాల ఆవరణలో తాగి పడేసిన మందు బాటిళ్లు

బోనకల్, ఆగస్టు18: బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రివేళల్లో మందుబాబులు మద్యం బాటిళ్లు తెచ్చుకొని జల్సా చేస్తున్నారు. తాగి విసిరిన బాటిళ్లు కళాశాల ఆవరణలోనే ఉండటంతో కళాశాలకు వచ్చే అధ్యాపకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. 8 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కళాశాలకు ప్రహరీ లేక పోవడంతో మందుబాబులు నేరుగా మద్యం సీసాలతో కళాశాల ఆవరణలోకి వచ్చి మద్యం సేవిస్తున్నారు. కళాశాలకు దగ్గరలో బాలికల గురుకుల పాఠశాలలు ఉండటంతో రాత్రివేళల్లో మద్యం బాబుల వలన ఇబ్బంది ఉంటుదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. రెండు దశాబ్ధాలుగా కళాశాలకు ప్రహరి నిర్మాణం లేక పక్కనే ఉన్న రోడ్డు పై నిత్యం వాహనాల రద్దీ వలన అధ్యాపకులు అందించే బోధనకు కొంతమేరకు ఆటంకం కలుగుతుంది. పలు సార్లు ప్రజా ప్రతినిధులకు ప్రహరీ కోసం వినతిపత్రాలు అందించినా ఫలితం లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా కళాశాల ఆవరణ మారిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి కళాశాలకు ప్రహరి నిర్మాణం, గేటును ఏర్పాటు చేస్తే ప్రభుత్వ కళాశాలకు రక్షణ ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టవచ్చునని తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా పోలీస్ అవుట్‌పోస్ట్‌లు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు18: రోడ్డు ప్రమాదాలను నిరోధించేందుకు, ట్రాఫిక్ నిబంధనలు తెలియజేసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్ట్‌లు (బూత్స్) నిరుపయోగంగా మారాయి. జాతీయ రహదారిపై యూటర్న్‌ల వద్ద, కూడలిలో, రోడ్ కటింగ్‌ల వద్ద కొన్నేళ్ల క్రితం పోలీస్ అధికారులు ఏర్పాటుచేశారు. అయితే కాలక్రమంలో అవి శిథిలమవ్వడంతో పాటు వచ్చేపోయే వాహనాలు తగిలి నేలకొరగడంతో రోడ్డుకు అడ్డుగా ఉన్నాయని అక్కడి నుంచి తొలగించి మునిసిపల్ భవనం సమీపంలో పడవేశారు. అయితే ఇక్కడ వాటి చుట్టూతా పిచ్చిమొక్కలు పెరిగాయని, సమీపంలో వసతి గృహాల విద్యార్థులకు ఇబ్బందిగా మారాయని ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా బహిరంగ మలమూత్ర విసర్జనలతో పాటు విషసర్పాలు తిరుగుతున్నాయని, విద్యార్థుల గురించి ఆలోచించి వాటిని ఇక్కడి నుంచి తొలగించాలని పలువురు కోరుతున్నారు.



కంపచెట్లలో పడవేసిన పోలీస్ అవుట్‌పోస్ట్‌లు (బూత్స్)

అధ్వానంగా రహదారులు

- గుంతలమయంగా వంతెనలు
- అన్నీ వదిలేసిన హైవే అథార్టీ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వైరా, ఆగస్టు18: ఎవరేమనుకున్నా తమకేంటి అనే రీతిలో నేషనల్ హైవే అథార్టీ అధికారులు అన్నీ గాలికి వదిలేశారు. ఫలితంగా వైరా హైలెవల్ వంతెనపై వాహనాల రాకపోకలు నరకయాతనగా మారాయి. ఏనాడూ హైలెవల్ వంతెన నిర్వహణను ఎన్‌హెచ్ అధికారులు చిత్తశుద్ధితో పట్టించుకోవడం లేదు. దాంతో ప్రయాణాలు దినదినగండం నూరేళ్ల ఆయుషుగా తయారయ్యాయి. జాతీయ ప్రధాన రహదారిలో వైరా నదిపై ఉన్న ఈ హైలెవల్ వంతెన ప్రయాణీకులకు ప్రాణసంకటంగా మారింది. గత ప్రభుత్వ హయాంలోనే కాకుండా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఈ ఎనిమిదినెలల కాలంలో కూడా ఈ వంతెన నిర్వహణ గురించి ఎన్‌హెచ్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నా జిల్లాలో డిప్యూటీ సీఎం, మరో ఇద్దరు మంత్రులున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం ఈ వంతెన పైభాగంలో జాయింట్ల మధ్యన గుంతలేర్పడ్డాయి. ఫలితంగా వాహనాలు చీమ నడక మాదిరిగా రాకపోకలు కొనసాగించాల్సిన దుస్థితి నెలకొంది. భారీ వాహనాల పరిస్థితి ఇలా ఉంటే ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు ఈ గుంతల్లో దెబ్బతింటున్నాయి. కార్లు సైతం గుల్లవుతున్నాయి. నిత్యం ద్విచక్రవాహన చోదకులు పడిపోతూ తీవ్ర గాయాలపాలవుతున్నారు. ఈ సమయంలో వాహనాల రాకపోకలు నిల్చిపోతున్నాయి. భారీగా ట్రాఫిక్ స్తంభించిపోతుంది. వంతెనపైన ఎదురెదురుగా వాహనాలు వచ్చిన సమయంలో కనీసం పాదచారులు సైతం తప్పుకొనే పరిస్థితి లేదు. అంత ఇరుకుగా ఈ వంతెన ఉంది. తెలంగాణ, ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు అనుసంధానంగా ఈ జాతీయ ప్రధాన రహదారి ఉంది. వైరా నదిపై 32ఏళ్ల కిందట నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి.

గత 40రోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలకు శ్లాబ్‌ల జాయింట్ల మధ్య గుంతలేర్పడి వాహనాలు గుద్దుకుంటున్నాయి. ఇరుకు వంతెనపైన గుంతలను తప్పించుకొనేందుకు వాహనాలు అడ్డదిడ్డంగా సర్కస్‌లో ఫీట్ల మాదిరిగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులు ఎన్‌హెచ్ అధికారులపై తగు చర్యలు తీసుకొని ఈ వంతెనకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.



గుంతల్లో నుంచే ప్రయాణిస్తున్న వాహనాలు

కష్టజీవుల వెన్నంటి ఉండేది కమ్యూనిస్టులే

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం/లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 18: కష్టజీవుల వెన్నంటి ఉండేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎస్ఆర్‌గార్డెన్స్‌లో సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు, కార్మికుల అండగా ఉంటూ సమస్యలపై ప్రశ్నిస్తే పోరాడాది కమ్యూనిస్టులు మాత్రమే అని గుర్తు చేశారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, జిల్లా రాజీకయరిపోర్టు ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి. అయోధ్య, కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, పులిరెడ్డికే. సారయ్య, ఏపూరి బ్రహ్మం, మున్నా లక్ష్మికుమారి, ఎస్‌డి. సలీం, నరాటి ప్రసాద్, కల్లూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 18: మెదక్‌లో ఈనెల 17, 18 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ పోటీలలో నగరానికి చెందిన క్రీడాకారుడు వేణు సత్తా చాటి రెండు స్వర్ణ పతకాలు సాధించాడు. షాట్‌పుట్, డిస్కస్‌త్రో విభాగాలలోను ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా వేణును డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యదర్శి షఫీక్ అహ్మద్‌లు అభినందించారు.

భద్రాద్రికి ఆరు పతకాలు

చుంచుపల్లి, ఆగస్టు18: తెలంగాణ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2024లో భద్రాద్రి జిల్లా అథ్లెటిక్స్‌కు ఆరు పతకాలు వరించాయి. మెదక్ జిల్లాలో ఇటీవల ముగిసిన రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో జిల్లా నుంచి అథ్లెటిక్‌లు 10 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో భద్రాచలానికి చెందిన వర్స రాజు 800ల మీటర్ల పరుగు పందెంలో పురుషుల విభాగంలో బంగారు పతకం, పాల్వంచకు చెందిన మహేశ్వరీకి జావెలింగ్ త్రో మహిళా విభాగంలో బంగారు పతకం, జె.రాజేశ్వరీకి హేమర్ త్రో మహిళా విభాగంలో బంగారం పతకం, రుద్రంపూర్‌కు చెందిన అభిలాష్‌కు 200 మీటర్ల పరుగు పందెం, పురుషుల విభాగంలో రజతం, పాల్వంచకు చెందిన వి.శృతికి ట్రిపుల్ జంప్‌లో మహిళా విభాగంలో రజతం, పి.హర్షితకు జావ్లింగ్ త్రో యువజన విభాగంలో రజిత పథకాలు వరించాయి. క్రీడాకారులను రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ కె.సారంగపాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.వెంకటేశ్వరరెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టపు రాధాకృష్ణ, కార్యదర్శి కె.మహిదర్ ప్రత్యేకంగా అభినందించారు.

సబ్ క్రిటికల్‌తో కష్టాలు

- బీటీపీఎస్‌లో కాలం చెల్లిన సాంకేతికత
- మొరాయిస్తున్న పరికరాలతో తిప్పలు
- స్క్రాప్‌తో ప్లాంట్ నిర్మాణం..
- నడవబోమంటున్న ప్లాంట్లు
- అధికారుల కుంటి సాకులు

మణుగూరురూరల్, ఆగస్టు 18: భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు ఆది నుంచి ఆటంకాలే ఎదురవుతున్నాయి. కాలం చెల్లిన సాంకేతిక పరికరాలతో బీటీపీఎస్ నిర్మాణం చేపట్టడంతో నిత్యం తిప్పలు తప్పడం లేదు. పరికరాలు మొరాయిస్తుండటంతో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. అధికారులు మాత్రం బయటకు కుంటి సాకులు చెబుతున్నప్పటికీ కాలం చెల్లిన సాంకేతిక పరికరాలతోనే ప్లాంట్‌కు నిత్యం మరమ్మతులు చేస్తున్నారు. 2015లో ప్లాంట్ నిర్మాణానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టగా నిర్మాణ పనులు చేపట్టిన అనతి కాలంలోనే పర్యావరణ అనుమతులు లేవంటూ రెండున్నర ఏళ్ల పాటు నిర్మాణాలు నిలిచి పోయాయి. ఆ తర్వాత అనుమతులతో ప్రారంభమైనా కూడా నాసిరకంగా ఉన్న ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో నిరుపయోగంగా ఉన్న పరికరాలను ఇక్కడికి తరలించి నామినేటెడ్ విధానం ద్వారా బీహెచ్ఈఎల్‌కు కాంట్రాక్టు పద్ధతిన అప్పగించారనే ఆరోపనలు వెల్లువెత్తుతున్నాయి.

ప్లాంట్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించిన నాటి నుంచి ఏదో ఓ సాంకేతిక లోపాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతూనే ఉంది. సూపర్ క్రిటికల్ పరిజ్ఞానంతో ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం కాలం చెల్లిన సాంకేతిక పరికరాలతో సబ్ క్రిటికల్ పరిజ్ఞానంతో ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తి చేసింది.

భవిష్యత్ లో సమస్యలెన్నో

బీటీపీఎస్‌లో సాంకేతికంగా నిత్యం తలెత్తుతున్న సమస్యలు పరిష్కరించడం కష్టతరంగా మారినట్లు తెలుస్తోంది స్క్రాప్ మెటీరియల్‌తో విద్యుత్ ఉత్పత్తి అయ్యే కీలక ప్రాంతాల్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అర్థం కాని పరిస్థితులు ఉన్నట్లు వినికిడి. ఇప్పుడే ఇన్ని అవాంతరాలను ఎదుర్కొంటున్న ప్లాంట్ ఇక భవిష్యత్‌లో ఇంకెన్ని సమస్యలను ఎదుర్కోంటుందో అనే ఆందోళన అధికార వర్గాల్లో వెల్లడవుతోంది. ఇటీవల జనరేట్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఇదే కోవలో కాలిపోయినట్లు అధికారులు చెప్పకనే చెబుతున్నారు. పాత పరికరాలు పాడైనవి వాడకం వల్ల ఉన్న నాలుగు యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి ఎప్పుడు ఆగుతుందో ఎప్పుడు జరుగుతుందో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఇప్పటికే పలు మార్లు జెన్కో యాజమాన్యానికి నివేదికలు అందజేస్తున్నట్లు కూడా తెలిసింది. ఇప్పటికే జనరేట్ ట్రాన్స్ ఫార్మర్ కాలిపోవడంతో ఓ యూనిట్ విద్యుత్ ఉత్పాదన నిలిచిపోయి దాదాపు మూడు నెలల సమయం గడుస్తోంది. కోట్లాది రూపాయల నష్టం బీటీపీఎస్ ద్వారా ప్రభుత్వానికి వాటిల్లింది. ఇక నిర్వహణ చేస్తు్న కొలదీ మిగతా యూనిట్లలో ఒక్కొక్కటిగా లోపాలు బయపడుతున్నట్లు వినికిడి. ఇలా నిత్యం మరమ్మతుల పేరుతో విద్యుత్ ఉత్పత్తిలో జరిగే అవాంతరాలు రేపటి రోజున మరెన్ని చిక్కులు తెచ్చిపెడతాయో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. బీటీపీఎస్ భవితవ్యంపై భవితవ్యంపై నీలి నీడలు కమ్ముకునే పరిస్థితులు దాపరించబోతున్నట్లు తెలుస్తోంది.



ఇటీవల కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

వైరాలో దుమ్ముతో పరేషాన్

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● పట్టించుకోని అధికారులు

వైరా, ఆగస్టు 18: వైరాలో ఎదురెదురుగా మనుషులు సైతం కన్పించని రీతిలో రోడ్లను దుమ్ము ఆవరిస్తుంది. దాంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే వాహనాల నిర్లక్ష్యంతో ప్రజల బాధలు వర్ణనాతీతంగా ఉంది. ముఖ్యంగా శని, ఆదివారాల్లో ఈ దుమ్ముతో ప్రజలు పడరాని పాట్లు పడ్డారు. శ్వాసకోశ సంబంధమైన సమస్యలతో అనారోగ్యాలబారీనపడుతున్నారు. ఓవైపున స్థానిక మునిసిపాలిటీ, ఆర్అండ్‌బీ నిర్లక్ష్యంతో ప్రజలు దుమ్ము, ధూళితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే రెండురోజుల నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణానికి సంబంధించిన టిప్పర్లు, భారీ వాహనాల్లో సామర్థ్యానికి మించి స్టోన్‌డస్ట రవాణా చేస్తున్న సమయంలో వాహనాల్లోని ఆ స్టోన్‌డస్ట్ రోడ్డుపై కుప్పకుప్పలుగా పడిపోతుంది. ముఖ్యంగా జాతీయ ప్రధాన రహదారిలోని క్రాస్‌రోడ్డు నుంచి మూడుకిలోమీటర్ల దూరం ఉన్న సోమవరం వరకు ఈ స్టోన్‌డస్ట్ రోడ్డుపైన పడిపోతుంది. ముఖ్యంగా వైరాలో క్రాస్‌రోడ్డు నుంచి కిలోమీటర్ దూరం వ్యవసాయ మార్కెట్‌యార్డు వరకు ఈ స్టోన్‌డస్ట్‌లోనుంచి వాహనాలు వేగంతో రాకపోకలు కొనసాగిస్తున్న సమయంలో టైర్ల వెంట దుమ్ము లేచి ఊపిరి ఆడకుండా ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రోడ్డు వెంట ఉన్న దుకాణాలు, నివాసాల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానికులే కాకుండా వైరాకు ప్రతినిత్యం వేలాదిమంది వివిధ అవసరాల కోసం వచ్చిన సమయంలో ఈ దుమ్ముతో నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు స్థానిక క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డుపైన వెట్‌మిక్స్ పోసి వదిలేయడంతో దాని నుంచి కూడా విపరీతంగా దుమ్ము వ్యాపిస్తుంది. ఇప్పటికైనా ఈ దుమ్ము సమస్య నుంచి తమను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



వాహనాల టైర్ల వెంట విపరీతంగా లేచిన దుమ్ము

'నిందితులను కఠినంగా శిక్షించాలి'



మాట్లాడుతున్న బయ్యా శారద

కొత్తగూడెం, ఆగస్టు 18: కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి కిరాతకంగా హత్య చేయడాన్ని ప్రగతిశీల యువజన సంఘం, భారత కార్మికసంఘాల సమాఖ్య తీవ్రంగా ఖండిస్తున్నట్లు పీవైఎల్ రాష్ట్ర నాయకురాలు బయ్యా శారద అన్నారు. ఆదివారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నోముల కళావతి అధ్యక్షతన జరిగిన పీవోడబ్ల్యూ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇటీవల బీజేపీ ప్రభుత్వ హాయంలో మహిళలపై ఆరాచాకులు పెరిగిపోయాయని ఆరోపించారు. డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళల కుస్తీపోటీల్లో ఎన్నో పథకాలు సాధించిన రెజ్లపై లైంగిక వేదింపులకు పాల్పడిన బీజేపీ నేత బ్రిజిభూషణ్‌కు అండగా కేంద్రం అండగానిలిచిందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో బిల్కిస్ భానుపై అత్యాచారం చేసి వారి కుటుంబసభ్యులందర్ని నరికి చంపిన నేరస్తులకు సగౌరవం ఊరేగింపులు చేసిన చరిత్రదేశంలో ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఈ సమావేశంలో పెద్దగోని ఆదిలక్ష్మి, రాములమ్మ, మోకాళ్ల సుగుణ, మంజు, పీవైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల కళావతి, లాలమ్మ, బుజ్జి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడికి రాఖీ కట్టేందుకు వెళుతూ..

కారు ఢీకొని మహిళ మృతి

● ఖమ్మం నగరంలో ఘటన



మల్లమ్మ(ఫైల్)

ఖమ్మంక్రైం, ఆగస్టు 18: రాఖీ పండుగ సందర్భంగా తన సోదరుడికి రాఖీ కట్టేందుకు వెళుతూ ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఖమ్మం నగరంలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సబంధించి వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన గాజుల మల్లమ్మ(58) సోమవారం రాఖీ పండుగ సందర్భంగా ఖమ్మం నగరంలోని ఖానాపూరంలో ఉండే తన తమ్ముడికి రాఖీ కట్టేందుకు ఆదివారం సాయంత్రం ఖమ్మం వచ్చింది. ఈ క్రమంలో కొత్త బస్టాండ్‌లో బస్సు దిగిన మల్లమ్మ అక్కడి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వైపు నడుచుకుంటూ వెళుతుండగా ఆమె ఓ హోటల్ సమీపంలోకి రాగానే అతి వేగంగా వెనునుంచి వచ్చిన ఓ కారు రోడ్డుపక్కన నడిచి వెళుతున్న మల్లమ్మను ఢీకొట్టింది. దీంతో ఆమె గాల్లోకి ఎగిరి పది మీటర్ల దూరంలో పడిపోయి అక్కడికక్కడే మృతిచెందింది. మహిళను ఢీకొట్టిన కారు ఆ తరువాత హోటల్ పక్కనే ఉన్న రెండు విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌పార్మర్ పిల్లర్‌ను ఢీకొట్టింది. కారులోని ఎయిర్‌బెలూన్స్ ఓపెన్ కావడంతో కారు నడుపుతున్న వ్యక్తితో పాటు పక్కనే ఉన్న మహిళ స్వల్ప గాయాలతో బయపడ్డారు.

ప్రమాద విషయం తెలుసుకున్న ఖమ్మం టూటౌన్ పోలీసులు మృతురాలి వివరాలు తెలుసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. కాగా కారు అతివేగంగా రావడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు. అనంతరం స్థానికులు 108కు సమాచారం అదించడంతో వారు చేరుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు సుకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మహిళ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వసూళ్లకు పాల్పడితే చర్యలు

- ట్రాఫిక్ సిబ్బందికి అధికారుల హెచ్చరిక

ఖమ్మంక్రైం, ఆగస్టు18: ట్రాఫిక్ సిబ్బంది గాంధీచౌక్‌లో వసూళ్లకు పాల్పడుతున్న ఘటనపై ఆంధ్రజ్యోతిలో ఆదివారం 'గాంధీచౌక్‌లో ట్రాఫిక్ దందా' అని కథనం ప్రచురితమైన విషయం విధితమే. ఈకథనం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు ఇకపై వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం. అలాం టి సంఘటనలకు ఎవరు పాల్పడవద్దని, షాపు యజమానులకు కేటాయించిన సమయంలోనే కిరాణ సామాన్లు అన్‌లోడు చే యించుకోవాలని సమయం మించితే ట్రాఫిక్ జామ్ అయినా అక్కడున్న సిబ్బందిపై చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించినట్లు సమాచారం.

కానిస్టేబుల్‌పై చర్యలేవీ..?

నగరంలోని గాంధీచౌక్‌లో శనివారం ఓ హమాలీపై దాడిచేసిన కానిస్టేబుల్‌పై పోలీసు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈఘటనపై కానిస్టేబుల్ తప్పేమిలేదని, సిబ్బంది ఓ హెడ్‌కానిస్టేబుల్ వెనుకేసుకుంటూ అధికారులకు వివరాలు చెప్పారని తెలిసింది. దీంతో అధికారులు ఎటువంటి చర్యలు లేవు, ఇకపై జాగ్రత్తగా ఉండాలని సూచించినట్లు ప్రచారం జరుగుతుంది. దాడి చేసిన కానిస్టేబుల్ తరుపున వకాల్తా పుచ్చుకున్న మరో ఇద్దరు కానిస్టేబుళ్లు హమాలీ తరుపున వారితో మాట్లాడి తప్పు జరిగింది, ఇంకోసారి ఇలా జరగదు, అధికారులు ఎవరైనా అడిగితే కానిస్టేబుల్ తప్పేమిలేదని చెప్పాలని బతిమిలాడినట్లు సమాచారం.

ఎదురెదురుగా ఢీకొన్న కార్లు...

● నలుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కార్లు

నేలకొండపల్లి, ఆగస్టు18: బోదుల బండ ఫ్లైఓవర్‌పైన రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. ఆదివారం ఓశుభకార్యానికి హాజరై కోదాడ వైపు నుంచి ఖమ్మం వైపు వెళుతున్న టీఎస్29క6660నెంబరు కల కారు, ఖమ్మం వైపు నుంచి కోదాడ వైపు వెళుతున్న ఏపీ20ఏఈ3573 నెంబరు గల కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో టీఎస్ 29క6660 నెంబరు కారులోని నలుగురు పార్వతి, భాగ్య మ్మ, సలీమ్, హుస్సేన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. ఇంకో కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో ఆకారులోని వాళ్లకు ఎటువంటి గాయాలు కాలేదు. తీవ్రంగా గాయపడ్డ వారిని 108 అంబులెన్సుల్లో చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు. సమాచారం అందుకున్న నేలకొండపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో గాయపడిన పార్వతమ్మ(70) చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా వీరంతా సూర్యాపేట జిల్లా చిలుకూరులోని ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

రహదారిపై మందు పాతర గుర్తింపు

● నిర్వీర్యం చేసిన పోలీసులు

చర్ల, అగస్టు 18: పోలీసులే లక్ష్యంగా రహదారిపై మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందుపాతరను ఛత్తీస్‌గఢ్ బలగాలు ఆదివారం నిర్వీర్యం చేశాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా చిన్నగల్లేరు రహదారిపై సీఆర్‌పీఎఫ్ బలగాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో వారిని దెబ్బకొట్టేందుకు రహదారిపై మావోయిస్టులు ఐఈడీ మందుపాతరను ఏర్పాటు చేశారు. ఏరియా డామినేషన్ చేస్తున్న బలగాలు ఆదివారం మందుపారతను గుర్తించి నిర్వీర్యం చేశారు. మందుపారతను బలగాలు గుర్తించకపోయి ఉంటే పెను ప్రమాదం జరిగేది. గత కొంత కాలంగా ఛత్తీస్‌గడ్‌లోని బస్తర్ డివిజన్‌లో ఇలాంటి ఘటనలు అనేకం వెలుగులోకి వస్తున్నాయి.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

దుమ్ముగూడెం, ఆగస్టు18: మండలంలోని ఎర్రబోరులో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ముర్రం లక్ష్మి పూరిల్లు ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. గ్యాస్ లీకేజీ కారణంగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోండగా, ఎవరికీ ప్రమాదం జరగలేదు. అగ్నిప్రమాదంలో సుమారు రూ. 2లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.

వ్యవసాయ మోటార్ల చోరీ

చింతకాని, ఆగస్టు 18: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన తూము అంజయ్య, తూము నాగేశ్వరరావుల వ్యవసాయ విద్యుత్ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు అర్థరాత్రి సమయంలో అపహరించారు. రెండు రోజుల క్రితం లచ్చగూడెం గ్రామానికి చెందిన వంకాయలపాటి కోటేశ్వరరావుకు సంబంధించిన రెండు వ్యవసాయ విద్యుత్ మోటార్లు సైతం చోరీకి గురయ్యాయి. విద్యుత్ మోటార్ల అపహరణకు సంబంధించి రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

రసాయనిక ఎరువులు చల్లిన కూలీలకు అస్వస్థత

- సకాలంలో వైద్యం అందడంతో కోలుకున్న కూలీలు
- అన్నారుగూడెంలో ఘటన



కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

తల్లాడ, ఆగస్టు 18: వరిపొలంలో మిశ్రమ రసాయనిక ఎరువు చల్లుతుండగా దాని విషప్రభావంతో తొమ్మిదిమంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెంలో ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అన్నారుగూడెం గ్రామానికి చెందిన డి.శ్రీనివాసరావు అనే రైతుకు చెందిన వరిపొలంలో గుళికలు, డీఏపీ, యూరియా కలిపిన మిశ్రమ ఎరువును జల్లేందుకు నూతనకల్ గ్రామానికి చెందిన కూలీలు కాంపాటి పాపారావు, కర్లకంటి శ్రీను, కొమ్మనబోయిన భద్రయ్య, పెద్దబోయిన పవన్‌కల్యాణ్, తేళ్లపుట్ట లక్ష్మణ్, కిన్నెర కృష్ణ, పమ్మి గోపాలకృష్ణ, డి.భద్రాద్రి, కె.వేణుగోపాల్ అనే కూలీలు వెళ్లారు. ఈ క్రమంలో వారు రసాయనిక ఎరువు చల్లుతున్న సమయంలో వీరు వాంతులు, తలనొప్పి, కడుపునొప్పితో అస్వస్థతకు గురయ్యారు. కూలీలు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న రైతు వెంటనే వారిని ఆటోల్లో నూతనకల్ గ్రామానికి తరలించారు. అక్కడ స్థానిక ప్రైవేట్ వైద్యుడి వద్ద ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కొంతమందిని 108వాహనంలో, మరి కొంతమందిని సామాజిక కార్యకర్త వరికొల్లి రమేష్ ఆటోలో కల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తొమ్మిదిమంది కూలీలు అస్వస్థతకు గురైన విషయంపై సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కు వరికొల్లి రమేష్ ఫోన్ చేసి సమాచారం అందించాడు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కల్లూరు ఆరోగ్య కేంద్రం వైద్యులను అప్రమత్తం చేశారు. సకాలంలో వారందరికీ మెరుగైన వైద్యం అందడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. అస్వస్థలకు గురైన కూలీలకు కల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రమేష్, శ్రీవిద్య, శ్రీజన్య, గోపిల ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించారు. కూలీల ఆరోగ్యం మెరుగుపడటంతో వారందరినీ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం



మణిరాగ్‌రెడ్డి(ఫైల్)

మధిరటౌన్, ఆగస్టు 18: ప్రేమ విఫలం కావడంతో ఓ యువకుడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మధిరలో చోటు చేసుకుంది. మధిర టౌన్ ఎస్ఐ సంధ్య తెలిపిన వివరాల ప్రకారం.. మధిర పట్టణం సాయినగర్‌కు చెందిన బొగ్గుల శ్రీనివాసరెడ్డి పెద్ద కుమారుడు బొగ్గుల మణిరాగ్‌రెడ్డి(29) హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 12న ప్రేమ విఫలం కావడంతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఓ సెల్ఫీ వీడియో తీసి స్నేహితులకు పెట్టి క్రిమిసంహారక మందు తాగాడు, ఇది చూసిన స్నేహితులు వెంటనే సమాచారాన్ని తండ్రికి తెలియజేసి అతడిని హైదారాబాద్ లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆత్మహత్యయత్నానికి పాల్పడిన మణిరాగ్‌రెడ్డి ఆరోగ్యం విషమించడంతో వైద్యులు ఇంటికి తీసుకువెళ్లాలని చెప్పడంతో తండ్రి మధిరకు తీసుకువస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మణిరాగ్ తండ్రి ఎల్ఐసీ ఏజంట్‌గా పని చేస్తున్నాడు, తల్లి జిలుగుమాడు ప్రభుత్వ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మంక్రైం, ఆగస్టు18: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఖమ్మం నగరంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని పాకబండబజార్‌కు చెందిన నరసింహారావు(40) వంటమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. గత కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మద్యానికి బానిసై ఆదివారం చర్చి కంపౌడ్ బ్రిడ్జి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

నామవరంలో వివాహిత...

చింతకాని, ఆగస్టు 18: మండల పరిధిలోని మత్కేపల్లి నామవరం గ్రామంలో తన స్వగృహంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని చిక్కుళ్ల హరిత (29) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సదరు వివాహిత అనారోగ్య కారణాలతో ఉరేసుకుందా..కుటుంబ కలహాలతో మృతి చెందిందా అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. చింతకాని ఎస్ఐ నాగుల్‌మీరా ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

అంకమ్మ తల్లి ఆలయంలో చోరీ



ఆలయంలోకి ప్రవేశించిన గుర్తు తెలియని దొంగలు

ఖమ్మంక్రైం, ఆగస్టు18: అంకమ్మతల్లి ఆలయంలో వెండి కిరీటాలను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన శనివారం అర్ధరాత్రి ఖమ్మం నగర పరిధిలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. నగర పరిధిలోని కైకొండాయిగూడెం రోడ్డులోని అంకమ్మతల్లి ఆలయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు చొరబడి అమ్మవారి వెండి కిరీటాలు, మూడు బంగారుపుస్తెలు చోరీ చేశారు. ఆదివారం ఉదయం ఆలయ పూజా రి ఆలయం వద్దకు రాగా ప్రధాన గేటు తాళాలు పగలగొట్టి ఉన్నాయి. తర్వాత ఆలయ ముఖద్వారం చూడగా అక్కడ కూడా తాళం పగులగొట్టి వెండి, బంగారు వస్తువులు కనబడలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి ఆలయ కమిటీకి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఆలయ కమిటీ సభ్యులు సంఘటనా స్థలం వద్దకు చేరకుని సీసీ కెమెరాలు పరిశీలించి, ఖమ్మం ఖానాపురంహవేలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు, క్లూస్‌టీం ఆలయం వద్దకు చేరుకుని ఫింగర్ ప్రింట్స్, సీసీ కెమెరాల ఫుటేజీని సేకరించారు.

కాగా ఈ ఆలయంలో గతంలో కూడా రెండుసార్లు చోరీలు జరిగాయి. పోలీసులు పెట్రోలింగ్ సరిగా లేకపోవడంతో ఈచోరీలకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. వరుస చోరీలు జరుగుతున్నా పోలీసులు ఫిర్యాదులు స్వీకరిస్తున్నారే తప్ప, దొంగలను పట్టుకుని రికవరీలు కూడా చూపడం లేదని ఆలయ భక్తులు ఆరోపిస్తున్నారు.

పద్మశాలి సంఘం ఎన్నికలు

ఇల్లెందు టైన్. ఆగస్టు 18: పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికల కోసం ఆదివారం ఓటింగ్ నిర్వహించారు. భద్రాద్రి జిల్లాలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఇల్లెందు పోలింగ్ కేంద్రంలో 38మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పద్మశాలి రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం వాళ్లకాటి రాజ్‌కుమార్, బూర మల్లేషలు పోటీపడగా ఓటింగ్ అనివార్యమైంది. పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు గోచుకొండ సత్యనానాయణ, ఎన్నికల జోనల్ ఆఫీసర్ పద్మ, మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోచుకొండ శ్రీదేవి, కందగట్ల భిక్షపతి, సుదిమళ్ల రాజు తదితరుల ఆధ్వర్యంలో రాజ్‌కుమార్‌కు మద్దతుగా పోలింగ్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ కార్యదర్శి దోమల మహేశ్వర్, ఆడెపు నర్సింహారావు, సిలివేరు రమేష్, గడ్డం రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో యువకుడి మృతి




కామరాజు(ఫైల్)

దుమ్ముగూడెం ఆగస్టు18: పాముకాటుతో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నడికుడి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడికుడి గ్రామానికి చెందిన మడకం కామరాజు(23) ఆదివారం ఉదయం పదిగంటల సమయంలో గ్రామశివారు పోడుభూమిలో తాను సాగు చేస్తున్న పత్తి చేలో తన తండ్రితో కలిసి కలుపు మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అతడిని పాము కాటు వేయడంతో స్పృహ కోల్పోయాడు. గమనించిన సహచర రైతులు అతడిని కిలోమీటరుకు పైగా బుజాలపై మోసుకొచ్చి ఆటోలో ములకపాడు పీహెచ్‌సీకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. యువకుడి మృతితో నడికుడి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అనుమానాస్పద స్థితిలో ట్రాక్టర్ డ్రైవర్...

వైరా ఆగస్టు 18: అనుమానాస్పద స్థితిలో ఆదివారం ఓ ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన వైరాలో చోటు చేసుకుంది. కొణిజర్ల మండలం లాలాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బండెల కృష్ణయ్య(45) అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండగా రైతులు గుర్తించారు. వైరాకు సమీపంలోని ఓ పామాయిల్ తోట పక్కనున్న పొలాల్లో దుక్కులు దున్నేందుకు వచ్చిన కృష్ణయ్య సాయంత్రం వరకు జాడలేకపోవడంతో ట్రాక్టర్ యజమాని పొలానికి చెందిన రైతుకు ఫోన్‌చేసి ఆరాతీశారు. తరువాత రైతులు పొలం వద్దకు వెళ్లగా కృష్ణయ్య శవమై కనిపించాడు. ట్రాక్టర్ అక్కడ కొంత దూరంలో వేరే పొలాల్లో నిలిచిపోయిఉంది. మృతిపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వైరా ఎస్ఐ సంఘటాస్థలాన్ని సందర్శించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో చుంచుపల్లి ఎంపీవో..



ఎంపీవో సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని


చుంచుపల్లి, ఆగస్టు18: గుండెపోటుతో చుంచుపల్లి మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) గుంటి సత్యనారాయణ (60) ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు. ఇటీవల ఎడమ కంటికి శస్త్ర చికిత్స చేసుకున్న ఎంపీవో ప్రతీ రెండు గంటలకు కంటి చుక్కలు వేసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి రెండు గంటలకు భార్య నిద్ర లేపి కంటి చుక్కలు వేశారు. తిరిగి 4 గంటలకు చుక్కలు వేసేందుకు ఎంపీవోను నిద్ర లేపగా ఎంతకి స్పందించకపోవడంతో ఇరుగుపొరుగు వారి సహాయంతో కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అతడిని పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జడ్పీ మాజీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, తహసీల్దార్ కృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా తదితరులు ఎంపీవో మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

'రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం'



పంటలను పరిశీలిస్తున్న నాయకులు

పెనుబల్లి, ఆగస్టు 18: మండలంలోని పార్థసారథిపురంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన మొక్కజొన్న రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పార్థసారథిపురంలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, శివరావు, రాఘవులు పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 18: మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేసి 11 సంవత్సరాలు అయినా నేటికి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించలేదని, ప్రభుత్వం వెంటనే బదిలీలు నిర్వహించాలని మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు నాయకులు హాజరై మాట్లాడారు. 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టి ఆదుకోవాలని కోరారు. గత ఏడాది బదిలీలకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చి నేటికి బదిలీలు నిర్వహించకపోవటం సరికాదన్నారు. 21న సమస్యల పరిష్కారానికి హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో శాంతియుతంగా ఒక రోజు నిరాహార దీక్షలను ఉపాధ్యాయులు విజవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాత్విక్, సభ్యులు మోహన్‌రావు, నాగరాజు, యూటీఎఫ్ నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అత్యాచారాలను అరికట్టండి

సత్తుపల్లిరూరల్/ముదిగొండ, ఆగస్టు18: మహిళా వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేయడాన్ని నిరసిస్తూ ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని బాసారంలో ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏ.శరత్, తాటి రాజు, దుంపా రాఘవులు, కిషక్షర్, సారా సుకన్య, సార సీత, దుంపా ఏసుమణి, ముద్దిని రావులమ్మ, అరుణ్‌కుమార్, పంతంగి నరసింహారావు, గంపా కృష్ణ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



ముదిగొండలో ర్యాలీ

కోల్‌కత్తా ఘటనకు నిరసనగా ర్యాలీ

ముదిగొండ: కోల్‌కత్తాలో మౌమిత ఘటనను నిరసిస్తూ మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని చిరుమర్రి గ్రామంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం మండల కార్యదర్శి పయ్యావుల ప్రభావతి మాట్లాడుతూ మహిళలపై ఇంత దారుణ సంఘటనలు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీటీసీ మోర గట్టమ్మ, చావగాని లలిత, కోలేటి అరుణ, బండి నాగమణి, ఇనుకొండ సులోచన, మోర సూరమ్మ, మోర మంజుల, కందుల పద్మ పాల్గొన్నారు.

శిక్షణ డాక్టర్‌పై హత్యాచారం ఖండిస్తున్నాం

ఖమ్మంచర్చికాంపౌండ్: కలకత్తాలో శిక్షణ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్యను ఖండిస్తున్నామని ఖమ్మం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నేరెళ్ల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నగరంలోనిప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఈసంఘటనకు సంబంధించి కలకత్తాకు వెళ్లి మృతిచెందిన ట్రెయినీ డాక్టర్ కుటుంబ సభ్యులను, తల్లిదండ్రులను కలిసి సంఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను తెలుసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సుగ్గాల వెంకటేశ్వరగుప్తా, తాళ్లూరి దిలీప్‌చౌదరి, పసుపులేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోజు వారి పరిష్కృతి చూపరా?

- కేవలం ఇన్‌వార్డుకే పరిమితమైన కేఎంసీ గ్రీవెన్స్ సెల్
- కలెక్టరేట్ తరహా గ్రీవెన్స్ సెల్ కోరుతున్న నగరవాసులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 18: ఖమ్మం కలెక్టరేట్‌లోకి ప్రజలు వారంలో ఏ రోజైనా వెళ్లి తమ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్‌లో నేరుగా ఫిర్యాదు చేసేందుకు వీలు ఉంది. అక్కడ నుంచి సంబంధిత విభాగాలకు దరఖాస్తులను పంపి సాధ్యమైన మేరకు పరిష్కారం చూపుతున్నారు. సమస్య పరిష్కారం కాకుంటే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో కలెక్టర్‌కు నేరుగా ఫిర్యాదులు అందిస్తున్నారు.

కానీ 4లక్షల ఓటర్లు ఉన్న ఖమ్మం నగరంలో రోజు వారీగా 30నుంచి 35 వరకు వినతులు జననాలు, మరణాలు, ఇంటి పన్నులు, పంపు పన్నులు, పేరు మార్పులు వంటి దరఖాస్తులతో ప్రజలు ఖమ్మం నగర పాలక సంస్థలోకి వస్తున్నారు. రోజువారీగా ప్రజావాణి విభాగం లేకపోవటంతో దరఖాస్తుదారులు ప్రతి రోజు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ, జనన, మరణ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ఇతర విభాగాలకు నేరుగా వెళ్తున్నారు. బ్లాక్ ఏ నుంచి బ్లాక్ బీ కు ప్రదిక్షణలు చేస్తున్నారు. రెవెన్యూ, ఇంజనీరింగ్, ప్లానింగ్ విభాగాల అధికారులు, ఉద్యోగులు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తుండటంతో కార్యాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వారు వచ్చే వరకు కూర్చుంటున్నారు. లేదా మరోసటి రోజు వస్తున్నారు. ఈ క్రమంలో రోజుల తరబడి పనులు కాకపోవటంతో తమ పనులు త్వరగా కావాలని దరఖాస్తుదారులు నేరుగా సంబంధిత విభాగాల ఉద్యోగులతో బేరాలు కుదుర్చుకుంటున్నారు.

కేఎంసీలో కొంత పరిచయం ఉన్న వారు మాత్రం ఇన్‌వార్డులో దరఖాస్తులను అందిస్తున్నారు. దీంతో ఇన్‌వార్డులో భారీగా దరఖాస్తులు పెరిగి అక్కడ నుంచి సంబంధిత విభాగాలకు పంపేందుకు వారం రోజులు పడుతోంది.

కలెక్టరేట్ తరహాలో గ్రీవెన్స్ సెల్ కోరుతున్న ప్రజలు

ఖమ్మం నగర పాలక సంస్థ బీ బ్లాక్ కార్యాలయం ముఖద్వారంలోకి వెళ్లగానే ఇన్‌వార్డు ముందు భాగంలోనే విశాలమైన పరిష్కృతికి అనువైన ఛాంబర్ ఉంది. అక్కడే జనన, మరణాలు, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, పింఛన్లు, మెప్మా, ఇందిరమ్మ ఇళ్లు, పారిశుధ్య ఫిర్యాదులు, ఇతర విభాగాలకు సంబంధించి ప్రత్యేకంగా డెస్కులను ఏర్పాటు చేసి దరఖాస్తులను ఫిర్యాదుదారుల నుంచి నేరుగా స్వీకరించి అక్కడ నుంచే ఆన్‌లైన్ చేసి ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని సంబంధిత విభాగాలకు పంపించి వాటి సేటస్‌ను దరఖాస్తుదారులకు తెలియజేయటం పరిష్కారం చూపాలని కోరుతున్నారు. రోజు వారిగా ప్రజా వినతులను స్వీకరించేందుకు ప్రత్యేకంగా ప్రజావాణి సెల్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. కార్యాలయానికి ఒక దరఖాస్తుదారుడు వస్తే అతని దరఖాస్తును ఆన్‌లైన్ చేసి ఒక రసీదును అందించి పరిష్కారం చూపాలని నగరవాసులు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న ఫిర్యాదుల స్వీకరణ విభాగం

పాపన్నగౌడ్ ఆశయాలను సాధిద్దాం: ఎమ్మెల్యే రాగమయి

- పాపన్న గౌడ్‌కు నాయకుల ఘన నివాళి

సత్తుపల్లి, ఆగస్టు18: బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీక అని, ఆయన ఆశాయాలను సాధిద్దామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పిలుపునిచ్చారు. ఆయన జయంతి ఉత్సవాలను స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేయగా కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాపన్నగౌడ్ ఆశయాలను సాధిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సత్తుపల్లిలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, వైరాలో నివాళులర్పిస్తున్న నాయకులు

●వైరాలో జరిగిన పాపన్నగౌడ్ జయంతి కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పర్సా రవి, పిచ్చయ్య, గాలిబు సైదులు, మాచర్ల ఆదినారాయణ, బాలబోయిన నర్సింహారావు, చీపు వెంకటేశ్వరరావు, చలమల రామకృష్ణ, దారగాని కృష్ణ మూర్తి, పర్సా రామకృష్ణ, గున్నాల సురేష్ పాల్గొన్నారు.

●కొణిజర్ల: మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో గౌడసోదరులు ఇజ్జగాని రామారావు, నరసింహరావు, గాలిబు వెంకన్న, కనకయ్య, వీరయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

●వేంసూరులో సత్తుపల్లి మాజీ ఎంపీపీ చింతలపాటి వెంకటేశ్వరగౌడ్, మాజీ ఎంపీటీసీ నాయుడు వెంకటేశ్వరరావు గౌడ్, వాకా చెన్నారావుగౌడ్, మల్లెల్లి నాగేశ్వరరావు, మల్లెల్లి చెన్నారావు, వెంకట్రావ్, పర్సా రాంబాబు, కుర్నవెల్లి లాలకృష్ణ, జీవీ.నర్సింహా, మల్లెల్లి ఫణికృష్ణ, మల్లెల అనిల్, తాటిక్రింది వేణుగోపాల్, యిజ్జగాని రాకేష్, గోదా చెన్నారావు పాల్గొన్నారు.

●పెనుబల్లిలో గౌడసంఘం మండల అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, గౌడసంఘం నాయకులు ఈవీ.రమేష్, వంగా దామోదర్‌రావు, చలమాల విఠల్‌రావు, బద్దూరి నాగేశ్వరరావు, కాటినేని శ్రీనివాసరావు, ఎస్‌వీకే.ప్రసాద్, చీపు నర్సింహారావు, చీపు వెంకటేశ్వర్లు, బొర్రా కోటేశ్వరరావు, బండి వెంకటేశ్వరరావు, వేముల రవికుమార్, మల్లెల శ్రీనివాసరావు, చిలుకుబత్తుల చెన్నారావు పాల్గొన్నారు.

●ఖమ్మంచర్చికాంపౌండ్: పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఆదివారం వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రముఖ విద్యావేత్త మహ్మద్ అసద్, ఎల్‌హెచ్‌పీఎస్(నంగారాభేరి) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్, రిటైర్డు సీఐపుల్లూరు నాగయ్య, షేక్ నజీమా, భూక్యా ఉపేంద్రబాయి, జంగిపల్లి రవి, శ్రీనివాసనాయక్, కోటేష్‌నాయక్, స్పందన, త్రివేణి, భవాని తదితరులు పాల్గొన్నారు.

●తల్లాడలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు గౌడసంఘం నాయకులు పాల్గొన్నారు.

● కామేపల్లిలలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు మట్టా ఉప్పలయ్య, బంధం శ్రీనివాసరావు, కేశగాని శ్రీనివాస్, బండి నర్సింహరావు, కేశగాని నాగయ్య, సత్యఆనారాయణ, అప్పయ్య, శివక్రిష్ణ, వాసు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాపన్నగౌడ్‌కు నివాళులు

ఖమ్మంటౌన్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి సందర్భంగా నగరంలోని ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి నగర బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, డీసీసీబీ, సుడా మాజీ చైర్మన్లు కూరాకుల నాగభూషణం, బచ్చు విజయకుమార్, బిచ్చాల తిరుమలరావు, అమరగాని వెంకన్న,మేకల సుగుణారావు తదితరులు పాల్గొన్నారు. కాగా మహిళా, స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసిచనివాళులు అర్పించారు.







ఖమ్మంలో నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, కొణిజర్ల మండలం తుమ్మలపల్లిలో, ఖమ్మంలో బీఆర్ఎస్ నాయకులు

రుణమాఫీ సమస్యలు పరిష్కరించాలి

వైరా ఆగస్టు 18: రైతు రుణమాఫీ సమస్యలు పరిష్కారం చేయాలి, రెండు లక్షల పైగా రుణం ఉన్న రైతులకు కూడా రుణమాఫీ డబ్బులు జమచేయాలని వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశం డిమాండ్ చేసింది. వైరా 'సాగుజీవం రైతుకు ఊతం' సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ పూర్తిఅయింది అని ప్రకటించారు. కానీ యాభైశాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. రుణమాఫీలో ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతురాంబాబు, వైరా మునిసిపాలిటీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఎస్‌కె లాల్‌అహ్మద్, కొప్పుల వెంకటేశ్వరరావు, వైరా సొసైటి మాజీ అధ్యక్షుడు మందడపు మధుసూదనరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, మాదినేని ప్రసాద్, తెలుగుదేశం నాయకులు మేదరమెట్ల పూర్ణయ్య, మోత్కూరు వెంకటేశ్వరరావు, రామారావు, సీపీఎం వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, రైతుసంఘం నాయకులు వనమా చిన్న సత్యనారాయణ, బాణాల శ్రీనివాసరావు, పైడిపల్లి సాంబశివరావు, ఎస్‌డి. పాషా, వడ్లమూడి మధు, యనమద్ది రామకృష్ణ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

కామేపల్లి: రైతులందరికి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ ఈనెల స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట దర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశవలో రైతు సంఘాల నాయకులు దుగ్గి క్రిష్ణ, ఏపూరి లతాదేవి, అంతోటి అచ్చయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు, అంబటి శ్రీనివాసరెడ్డి, సకినాల శ్రీనివాస్, పుల్లయ్య, శ్రీను, భాగం రంగారావు, ఎన్వీ రాకేష్ తదితరులు ఉన్నారు.



కామేపల్లిలో మాట్లాడుతున్న రైతుసంఘ నాయకులు

రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలి: టీడీపీ

తిరుమలాయపాలెం: అర్హులైన రైతులందరికి రుణమాఫీ వర్తింప చేయాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండబాల కరుణాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో అనేక వాగ్దానాలు చేసి వాటిని విస్మరించారని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు కొప్పుల వెంకటరావు, మల్లీడి భాగ్యమ్మ, మల్లీడి నాగేశ్వరరావు, రమేష్, కొలిశెట్టి బిక్షం, రత్నాకరచారి పాల్గొన్నారు.

నేడు రఘునాథపాలెంలో కలెక్టర్ ఫిర్యాదుల స్వీకరణ

రఘునాథపాలెం, ఆగస్టు 18: ప్రజా వినతుల స్వీకరణ కోసం కలెక్టర్ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణీ కార్యక్రమం సోమవారం రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని తహసీల్దార్ లూధర్ విల్సన్ ఆదివారం తెలిపారు. ప్రజావాణీ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తారని ఫిర్యాదుదారులు, బాధితులు ప్రజావాణీలో పాల్గొనాలని సూచించారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యా హ్నం 1గంట వరకు గ్రీవెన్స్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

కన్నేటికి కాంగ్రెస్ నాయకుల నివాళి

ఖమ్మం రూరల్, ఆగస్టు 18: మండల పరిదిలోని మంగళగూడెం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కన్నేటి వెంకన్న ఇటీవల మృతిచెందాడు. మృతుని కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. కన్నేటి వెంకన్న చిత్రపటానికి నివాళులర్పించారు. వెంకన్న కుటుంబానికి తమ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్ది మల్లారెడ్డి, అప్పారావు, కొప్పుల చంద్రశేఖర్, వెంకటయ్య, కిషన్‌రావు, సత్యనారాయణ, మోహన్, ప్రసాద్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

●ఆర్‌అండ్‌బీ రహదారిలో గొయ్యి

తల్లాడ, ఆగస్టు 18: తల్లాడ మండలం కేశ్వాపురం గ్రామం వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిలో గొయ్యి ప్రమాదకరంగా ఉంది. పినపాక-కేశ్వాపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో పెద్ద గొయ్యి ఏర్పడింది. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వరద ఉధృతికి ఆర్‌అండ్‌బీ రహదారి కోతకు గురై గొయ్యి ఏర్పడింది. నిత్యం రహదారిపై భారీ సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారిలో గొయ్యి ఏర్పడటం వల్ల వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదానికి గురయ్యే పరిస్థితి నెలకొంది. ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకుడు షేక్.లాల్‌మియా కోరారు.



పినపాక-కేశ్వాపురం ఆర్‌అండ్‌బీ రహదారిలో ప్రమాదకరంగా గొయ్యి

కారేపల్లిలో రాఖీలషాపుల వద్ద సందడి

కారేపల్లి ఆగస్టు18: మండలంలో రాఖీలసందడినెలకొంది.ఈసందర్భంగా మండల పరిధిలోని అనేక గ్రామాల్లో నిర్వహకులు ఏర్పాటు చేసినరాఖీ విక్రయాలషాపులవద్ద అనేకమంది తమ తొడపుట్టిన అన్నతమ్ములకు రాఖీలు కట్టివారి ఆశీర్వదంతీసుకునేందకు రకరాకాలరాఖీలను,స్వీట్లను కొనుగోలు చేస్తున్నారు.

వివాహానికి హాజరైన హైకోర్టు న్యాయమూర్తి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 18: తన స్నేహితుని కుమార్తె వివాహానికి హైకోర్టు న్యాయమూర్తి కాజ శరత్ హాజరైనారు. ఖమ్మానికి చెందిన కరుణాకర్‌తో హైకోర్టు న్యాయమూర్తి శరత్‌కు ఏళ్ల నాటి స్నేహబంధం ఉంది. కరుణాకర్ కుమార్తె వివాహం ఆదివారం ఖమ్మంలో జరగటంతో న్యాయమూర్తి దంపతులు హాజరై వధువరులను ఆశీర్వదించారు.



వదువరులను ఆశీర్వదిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి శరత్ దంపతులు

కారేపల్లిలో ఎమ్మెల్యే రాందాస్ పర్యటన



వధువరులతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి ఆగస్టు 18: మండల పరిధిలోని పలుగ్రామాల్లో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదివారం పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల కేంద్రంలో గేటుకారేపల్లిగ్రామానికి చెందిన రంజని, మనోజ్ వివాహానికి హజరైనూతన వధువరులను ఆశ్వీరదించారు. అలాగే విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన తోటకూరి నాగయ్య దశదిశ కర్మలకు హజరై నాగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పలువురు మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బోడేపూడి వైద్యశిబిరం విజయవంతం

వైరా, ఆగస్టు 18: వైరాలో బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో ప్రతినెలా మూడో ఆదివారం జరిగే వైద్యశిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు చీకటి భారవి, మర్రి సుబ్బారావు వైద్యసేవలందించారు. 110నెలల క్రితం ప్రారంభమైన బోడేపూడి వైద్యశిబిరంలో డాక్టర్ల బృందం క్రమం తప్పకుండా హాజరవుతూ రోగులను పరీక్షించి వైద్యసేవలు అందజేస్తున్నారు. సంస్థ కార్యదర్శి బొంతు రాంబాబు, బొంతు సమత, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ, గుడిమెట్ల మోహన్‌రావు, రజిత, మల్లెంపాటి ప్రసాద్, కంభంపాటి సత్యనారాయణ, పాసంగులపాటి చలపతిరావు, మందడపు నాగేశ్వరరావు, రామారావు వైద్యసేవలను పర్యవేక్షించారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ భారవి

ఘనంగా బోనాల సందడి

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు18: శ్రావణమాసం రెండో ఆదివారం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాలలో బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ముత్యాలమ్మ, మైసమ్మ ఆలయాలవద్ద బోనాలతో , డప్పు, మంగళ వాయిద్యాలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఖమ్మం నగరంలోని వివిధ డివిజన్లలో గల అమ్మవారి ఆలయాల్లో బోనాలు సమర్పించారు. నగరంలోని చర్చి కాంపౌండ్ ముత్యాలమ్మతల్లి ఆలయం, వైరారోడ్డు లోని మైసమ్మగుడితో పాటు జూబ్లీపురలో గంగపుత్రుల ఆధ్వర్యంలో బోనాలను ఘనంగా నిర్వహించారు. 57వ డివిజన్ వడ్డెరకాలనీలో ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు.

●వైరా: శ్రావణమాసం సందర్భంగా ఆదివారం వైరాలో అనేక వర్గాలకు చెందిన ప్రజలు ముత్యాలమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. మండలంలోని అనేక గ్రామాల్లో కూడా ముత్యాలమ్మతల్లి సంబరాలు జరుపుకున్నారు.

●కొణిజర్ల: మండలంలోని ఆయా గ్రామాలలో శ్రావణమాసం ఆదివారం సందర్భంగా భక్తులు బోనాలు ఎత్తుకొని అమ్మవారికి సమర్పించారు. చిన్న, పెద్ద అంతా కూడ బోనాలపండుగలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని ముత్యాలమ్మ ఆలయాలన్ని భక్తులతో కిక్కిరిసి పోయాయి.

●సత్తుపల్లిరూరల్: శ్రావణమాసం సందర్భంగా ఆదివారం భక్తులు ముత్యాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని ఆయా ప్రాంతాలలో గ్రామదేవతగా పేరొందిన అమ్మవారికి భక్తులంతా బోనాలతో పాటు నైవేద్యం సమర్పించారు. ప్రతిఏటా ఆలయాల వద్ద భక్తులు పలువురు మొక్కులు చెల్లించుకున్నారు.

●ఖమ్మం రూరల్: మండలంలోని తెల్దారుపల్లి, గుర్రాలపాడు, నాయుడు పేట తదితర గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ బోనాల పండుగ వేడుకలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి ముత్యాలమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల మహిళలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

●కామేపల్లి: కామేపల్లి మండలంలోని పింజరమడుగు, ముచ్చర్ల గ్రామాల్లో శ్రావణ మాస బోనాలు ఆదివారం జరిగాయి.



తనికెళ్లలో బోనమెత్తుకున్న చిన్నారి





కామేపల్లి, ఖమ్మంలో బోనాలతో మహిళలు







ఖమ్మంలో గంగపుత్రుల ఆధ్వర్యంలో, వైరాలో యువకుల కేరింత, సత్తుపల్లిలో ముత్యాలమ్మకు పూజలు